# రైతుబంధు ఎప్పుడిస్తారో?

- ఇప్పటికే ప్రారంభమైన పంటల సాగు
- ఇంకా అందని ప్రభుత్వ ఆర్థిక సాయం
- సీజన్ ప్రారంభమైనా నిర్లిప్తతలోనే సర్కారు
- అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామన్న రేవంత్
- గత సీజన్‌లో రూ.10 వేలే ఇచ్చిన ప్రభుత్వం
- ఈసారైనా 'రైతు భరోసా' అమలు చేసేనా?
- సర్కారు నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

దోమకొండ. జూన్ 14: వానాకాలం ప్రారంభమైంది. పంటల సాగుకు రైతాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే దుక్కి దున్ని విత్తనాలు వేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే, సీజన్ ఆరంభంలోనే అందాల్సిన రైతుబంధు సాయం ఇంకా అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ హయాంలో జూన్‌లోనే రైతులకు రైతుబంధు డబ్బులు వచ్చేవి. దీంతో కర్షకులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఎలాంటి ఢోకా ఉండేది కాదు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితి మారిపోయింది. యాసంగికి సంబంధించిన రైతుబంధు డబ్బులను మొన్నటిదాకా ఖాతాల్లో జమ చేసిన రేవంత్ సర్కారు.. వానాకాలనికి సంబంధించిన ఇంకా ప్రక్రియనే మొదలు పెట్టలేదు. దీంతో డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు అయోమయం చెందుతున్నారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వైపు దృష్టి సారిస్తున్నారు.

### రైతుభరోసా అమలయ్యేనా..?

తాము అధికారంలోకి వస్తే రైతుబంధు కింద ఇస్తున్న మొత్తాన్ని మరింత పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందర వాగ్దానం చేసింది. రైతుభరోసా పేరిట ఎకరాకు ఇప్పుడిస్తున్న రూ.10 వేలకు అదనంగా రూ.5 వేలు కలిపి ఏటా రూ.15 వేలు అందిస్తామని ప్రకటించింది. కౌలు రైతులకూ రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, గత డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు తాము చెప్పినట్లుగా రైతుభరోసా అమలు చేయలేదు. కేసీఆర్ ఇచ్చినట్లే యాసంగి పెట్టుబడి సాయాన్ని రూ.5 వేలకు పరిమితం చేసింది. వానాకాలం నుంచి రైతుభరోసా అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అసలు పెట్టుబడి సాయం చేస్తారా..? చేస్తే రూ.10 వేలు ఇస్తారా.. లేక ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలకు పెంచుతారా? అన్న దానిపై స్పష్టత కరువైంది.






### అప్పులు తెచ్చి విత్తనాల కొనుగోలు..

పంటల సాగు ఆరంభానికి ముందే రైతులకు పెట్టుబడి అందించాలన్నది రైతుబంధు ముఖ్య ఉద్దేశం. కానీ, కాంగ్రెస్ సర్కారు ఆ లక్ష్యాన్ని నీరుగార్చేసింది. గత యాసంగిలో ఇవ్వాల్సిన పెట్టుబడి సొమ్మును మొన్నమొన్నటి వరకు అంటే లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనూ రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇక, వానాకాలం సాయానికి సంబంధించి ఇప్పటికీ ఉలుకుపలుకు లేదు. సీజన్ ప్రారంభం కావడం, తొలకరి జల్లులు కురుస్తుండడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. అయితే, రైతుబంధు డబ్బులు పడకపోవడంతో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బుల్లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్ణీత సమయంలోగా డబ్బులు రాకపోతే అదును దాటిపోతుందన్న భయంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు రైతులేమో రైతుబంధు సాయం రాగానే వడ్డీతో తిరిగి చెల్లిస్తామని చెప్పి డీలర్ల వద్ద ఉద్దెర పెట్టి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

### సాగుకు సర్కారు సాయం..

ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. నీళ్లు, కరెంట్ సరిగా లేక, సర్కారు మద్దతు లేక అన్నదాతల బతుకులు ఆగమయ్యాయి. అప్పులు తెచ్చి సాగు చేసినా పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ పరిస్థితి కొనసాగొద్దని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మక పథకానికి శ్రీకారం చుట్టారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడొద్దనే లక్ష్యంతో రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారు. 2018-19 వానకాలం నుంచి ప్రారంభమైన ఈ పథకం కింద మొదట్లో ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. ఆ తర్వాత ఆర్థిక సాయాన్ని రూ.5 వేలకు పెంచిన కేసీఆర్.. పంటల సాగు ఆరంభంలోనే రైతుల ఖాతాల్లో డబ్బును జమ చేశారు. అలాగే, నిరంతర కరెంట్, సాగునీటిని అందించడం, సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తేవడమే కాకుండా మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో వ్యవసాయం పండుగలా మారింది.

### ఇంతలో ఎంత మార్పు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. పదేండ్ల క్రితం నాటి దృశ్యాలు పునరావృతమమయ్యాయి. విత్తనాలు, ఎరువుల కోసం రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. పాస్ బుక్కులు, చెప్పులను వరుసలో పెట్టి పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు దాపురించాయి. గతంలో 24 గంటల పాటు కరెంట్ సరఫరా కాగా, ఇప్పుడు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. మొన్నటిదాకా నిండుగా కనిపించిన జలాశయాలు ఇప్పుడు ఎండిపోయి మైదానాలను తలపిస్తున్నాయి. గతంలో ఎండాకాలంలోనూ గలగల పారిన కాలువలు నేడు బోసిపోయాయి.

### ఆంక్షల పేరిట కొర్రీలు?

ఎన్నికల ముందర గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు రైతుబంధు పథకంపై ఆంక్షలు విధించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పుడున్న లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకుగాను అనేక కొర్రీలు పెట్టాలని యోచిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతుల నుంచి మొదలుకుని ఎంత భూమి ఉన్నా వారందరికీ పెట్టుబడి సాయం అందజేసింది. ఏటా రూ.12 వేల కోట్ల నుంచి రూ.16 వేల కోట్ల భారం పడుతున్నా రైతుల శ్రేయస్సు కోసం ఎక్కడా వెనక్కు తగ్గలేదు. కానీ ప్రస్తుత రేవంత్ సర్కారు అనేక కొర్రీలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని యోచిస్తున్నది

---

## అత్త మృతి.. కోడలిపై అనుమానం

- అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి
- కోడలే గొంతు పిసికి చంపేసిందని మామ ఫిర్యాదు

బిచ్కుంద, జూన్ 14: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన బిచ్కుంద మండలం బండారెంజల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. అయితే, అత్తాకోడలి మధ్య గొడవే ఆమె మృతికి కారణమని, కోడలే తన భార్య గొంతు నులిమి చంపిందని మామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డి, స్థానికుల కథనం మేరకు.. బండారెంజల్ గ్రామానికి చెందిన దొబ్బ విఠబోయి తన భార్య బాలవ్వ (65), కుమారుడు బాబు, కోడలు అంజవ్వ, ఇద్దరు మనువళ్లతో కలిసి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. ఆర్నెళ్ల క్రితం పెద్ద కూతురు భర్తతో గొడవ పడి పుట్టింటికి వచ్చింది. కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతుండగా విఠబోయి దంపతులు దవాఖానలో చూపిస్తున్నారు. అయితే, అది నచ్చని కోడలు అంజవ్వ తరచూ అత్తతో గొడవ పడేది. ఆడపడుచు కోసం అప్పులు తెచ్చి మరీ డబ్బులు ఖర్చు పెడుతున్నారని పోరు పెట్టేది. 15 రోజుల క్రితం పంట అమ్మగా వచ్చిన రూ.48 వేలు తమకే ఇవ్వాలని అత్తతో గొడవకు దిగిన కోడలు.. లేకపోతే చంపేస్తానంది. అయితే, శుక్రవారం విఠబోయి, ఆయన కుమారుడు బాబు బయటకు వెళ్లగా, ఇంట్లో అత్త, కోడలు మాత్రమే ఉన్నారు. ఏం జరిగిందో ఏమో కానీ విఠబోయి ఇంటికి వచ్చేసరికి బాలవ్వ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది. అయితే, ఉదయం అత్త కోడలు జుట్టు పట్టుకుని కొట్టుకున్నారని చుట్టుపక్కల వాళ్లు చెప్పడంతో కోడలే తన భార్యను గొంతు పిసికి చంపేసిందని విఠబోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అటవీశాఖ సిబ్బందిపై దాడి

- మోపాల్ మండలం కాల్పోల్ తండా శివారులో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు..

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

### ఎఫ్ఆర్వోతోపాటు నలుగురికి గాయాలు





అటవీశాఖ సిబ్బందిపై దాడి చేస్తున్న తండావాసులు

దాడిలో గాయపడిన అటవీశాఖ అధికారి

వినాయక నగర్, జూన్ 14: మోపాల్ మండలం కాల్పోల్ అటవీ ప్రాంతం శుక్రవారం ఉద్రిక్తంగా మారింది. కాల్పోల్ అటవీప్రాంతానికి వచ్చిన అటవీ శాఖాధికారులు, సిబ్బందిపై తండావాసులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఎఫ్ఆర్వోతోపాటు నలుగురికి గాయాలు కాగా..దాడికి పాల్పడినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు..నిజామాబాద్ అటవీ శాఖ సౌత్ రేంజ్ ఆఫీసర్ రాధిక.. తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం కాల్పోల్ తండా పరిధిలో ప్లాంటేషన్ ఏరియా పరిశీలన కోసం వెళ్లారు. అయితే ప్లాంటేషన్ ఏరియాలో కొందరు చెట్లను నరికివేసి ట్రాక్టర్‌తో చదునుచేస్తుండడం వీరు గుర్తించారు. అటవీఅధికారుల రాకను గమనించిన కొందరు తండవాసులు కర్రలు, మట్టి పెల్లలతో వీరిపై దాడికి పాల్పడ్డారు. దాడిలో ఎఫ్ఆర్వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణతోపాటు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్ సిబ్బందితో కలిసి కాల్పోల్ తండాకు చేరుకొని విచారణ చేపట్టారు. తమపై దాడిచేసిన వారిలో సుమారు 30 మంది వరకు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దాడికి పాల్పడిన వారిపై మోపాల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుల పేర్లను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

### నిందితులపై పీడీ యాక్టు పెట్టాలి

**రేంజ్ అధికారుల అసోసియేషన్ యూనిట్ ఉపాధ్యక్షుడు రవి మోహన్ భట్**

ఇందల్వాయి, జూన్ 14 : కాల్పోల్ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బందిపై తండావాసుల దాడి హేయమైన చర్య అని బాసర యూనిట్ రేంజ్ అధికారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇందల్వాయి రేంజ్ అధికారి రవి మోహన్ భట్ అన్నారు. దాడికి పాల్పడిన నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందల్వాయి రేంజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాల్పోల్ బీట్‌లో మూడేండ్ల క్రితం ఆరు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను ధ్వంసం చేశారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన అటవీశాఖ అధికారులపై దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని ఫారెస్ట్ అధికారులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఎక్కడైనా అటవీ ప్రాంతాన్ని అక్రమంగా చదును చేస్తే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## మరోసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టండి


- పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశం
- కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డి/ కంఠేశ్వర్, జూన్ 14 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీసీఎల్ఏ (రాష్ట్ర భూ పరిపాలన విభాగం) కమిషనర్ నవీన్‌మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థా యి వరకు పెండింగ్ ఉన్న అన్ని దరఖాస్తులనూ త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పా టిల్ మాట్లాడుతూ..జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, రమేశ్ రాథోడ్ పాల్గొన్నారు.

### బోధన్ పరిధిలోనే ఎక్కువగా అపరిష్కృత దరఖాస్తులు

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు**

నవీన్‌మిట్టల్‌తో వీసీ అనంతరం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆర్డీవోలు,తహసీల్దార్లతో సమావేశమై కీలక సూచనలు చేశారు. బోధన్ తహసీల్ కార్యాలయ పరిధిలో ఎక్కువ సంఖ్యలో ధరణి ధరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లో ఉంచకుండా వారం వ్యవధిలోపు అన్నింటినీ పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాతో ముడిపడిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధి కారులను ఆదేశించారు. అర్జీలపై చేపట్టిన చర్యల గురించి దరఖాస్తుదారుడికి వివరాలు తెలియజేయడంతో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలకు సంబంధించి రోజువారీగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కామారెడ్డిలో అధికారులతో కలిసి పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## బ్యాంకర్ల తీరుపై రైతన్న కన్నెర్ర

- పొల్కంపేట్‌లో వ్యవసాయభూమిలో ఎర్రజెండాలు పాతడంపై ఆగ్రహం
- లింగంపేట్ సహకార కేంద్ర బ్యాంకు ఎదుట ధర్నా
- సంఘీభావం తెలిపిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట, జూన్ 14: పంట రుణాల వసూళ్లలో కర్కశంగా వ్యవహరిస్తున్న సహకార కేంద్ర బ్యాంకు అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయ భూమిలో బ్యాంకు అధికారులు ఎర్ర జెండాలను పాతడంపై మండిపడ్డారు. ఈ మేరకు వారు లింగంపేట సహకారం కేంద్ర బ్యాంకు ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. పంట రుణాల వసూలులో బ్యాంకు అధికారులు వ్యవహరించిన తీరును ఎండగట్టారు. ధర్నాలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని రైతులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు రైతుల పక్షాన నిలవాల్సింది పోయి .. వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సహకార బ్యాంకు అధికారులు రైతుల పంటపొలాల్లోకి వెళ్లి ఎర్ర జెండాలు పాతి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని పేర్కొన్నారు. ఇలా రైతుల పంట పొలాల్లో ఎర్ర జెండాలు పాతడం చరిత్రలో మొదటి సారి అని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గతేడాది డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇంతవరకూ అమలుచేయకుండా రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. పొల్కంపేట గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయ భూమిలో బ్యాంకు అధికారులు ఎర్ర జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రైతు పరువు తీయడం సరికాదన్నారు. పాతిన ఎర్ర జెండాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రుణమాఫీ చేయడంతో పాటు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు నీరడి సంగమేశ్వర్, సాయిలు, గంగారాం, గన్ను నాయక్, నరేశ్, వెంకటేశం, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, సాయికిరణ్, సిద్దిరాములు, మహిపాల్‌రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సహకార బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్